
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ♦ 11 ♦ మార్చి ♦ 2025



టన్ను చీనీ రూ.21,500
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.21,500, కనిష్ఠంగా రూ.4,350 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.8 కనిష్ఠంగా రూ.5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

'చింత'కు రికార్డు ధర



మార్కెట్‌లో చింత పండు క్రయ విక్రయాలు

హిందూపురం అర్బన్: చింతపండు ధర అమాంతం పెరిగింది. సోమవారం క్వింటా రూ.40 వేలు పలికి ఈ ఏడాది గరిష్ఠ రికార్డును తాకింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 2146.80 క్వింటాళ్ల చింత పండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా చింతపండు గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిన రూ.15 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ. 12,400, కనిష్ఠంగా రూ.4,200, సరాసరిన రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి. ఈసారి చింతపండు దిగుబడి తగ్గడం, డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో మంచి ధర దక్కుతోంది.

140 మంది విద్యార్థుల గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా సాగుతున్నాయి. సోమవారం జిల్లాలోని 42 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం విద్యార్థులకు మ్యాథమ్యాటిక్స్–2బీ/జూవాలజీ–2/ హిస్టరీ పేపర్– 2 పరీక్ష జరిగింది. జనరల్ విద్యార్థులు 6,339 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 6,236 మంది హాజరయ్యారు. ఇక ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,144 మందికిగానూ 1,107 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 140 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సురేష్, రామరాజు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు.

పరారీలో రెడ్డెప్పశెట్టి !

- ఇప్పటికే రెండు కేసులు..
  అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి..?

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిలమత్తూరు మండలం కోడూరు రెవెన్యూ గ్రామ పరిధిలో చిత్రావతి నదీ పరివాహక భూములను ఆక్రమించిన రియల్టర్ రెడ్డప్ప శెట్టి పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది. చిత్రావతిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మించడంతో ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే రెడ్డప్పశెట్టిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా తన పొలానికి వెళ్లే దారిని రెడ్డెప్పశెట్టి మూసివేయడంతో పాటు ప్రశ్నించిన తనను బెదిరించాడని స్థానిక రైతు నరసింహులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు రెడ్డెప్పశెట్టిపై 341 సెక్షన్ కింద మరో కేసు నమోదు చేశారు.

కంచె వ్యవహారంలో మరో కేసు
రైతుల పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా కంచె వేయడం, నదిని తన ఆధీనంలో ఉంచుకోవడం వంటివి రెడ్డెప్పశెట్టి మెడకు చుట్టుకుంటున్నాయి. రెవెన్యూ అధికారుల విచారణలో రెడ్డప్పశెట్టి అసైన్డ్ భూములను కొనుగోలు చేశారని తేలడంతో ఆ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రెడ్డెప్ప శెట్టి పరారీలో ఉన్నట్టుగా తెలుస్తోంది. పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టుగా సమాచారం. రెవెన్యూ అధికారులు మరో నోటీసు ఇవ్వాల్సి ఉండగా.. ఆయన అందుబాటులో లేరని తెలుస్తోంది.

ఉద్యోగమా.. నువ్వెక్కడ?

అనంతపురం నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల క్రితం ఓ ప్రముఖ జ్యువెలరీ సంస్థ సేల్స్‌మెన్ ఉద్యోగాలకు నిర్వహించిన వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు పోటెత్తిన నిరుద్యోగులు వీరు. ఇంజినీరింగ్ మొదలు ఎంబీఏ పట్టభద్రుల వరకు వందల మంది హాజరయ్యారు. దీంతో హోటల్ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. చిన్న సేల్స్‌మెన్ ఉద్యోగం కోసం వచ్చిన వీరిని చూస్తే జిల్లాలో నిరుద్యోగ సమస్య ఎంతలా ఉందో అంచనా వేయొచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.



పతాక స్థాయికి నిరుద్యోగం
- గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు ఉన్నా ఫలితం శూన్యం
- ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కాక చిన్న ఉద్యోగాలకూ దిక్కులేని వైనం
- 20 లక్షల ఉద్యోగాలిస్తామని ముఖం చాటేసిన చంద్రబాబు
- భృతి ఇస్తామని చెప్పి రిక్తహస్తం చూపడంపై నిరుద్యోగుల మండిపాటు

❒ గార్లదిన్నెకు చెందిన రాజశేఖర్ ఇటీవల బీఎస్సీ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసినా రాలేదు. దీంతో ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. మరో ఉద్యోగంలో చేరదామని ఎంత ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోతోందని రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.



❒ రాప్తాడుకు చెందిన శీనయ్య అనంతపురంలో బీకాం పూర్తి చేశాడు. తన అర్హతకు తగిన జాబు కోసం కొన్ని నెలలుగా ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. దీంతో ఇటీవల ఓ పెట్రోలు బంకు యజమాని వద్ద నిర్వహణ మేనేజర్‌గా చేరాడు. రేయింబవళ్లు పనిచేస్తే రూ.12 వేలు వేతనం. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది నిరుద్యోగులది ఇదే పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అలవిగాని హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత మాట తప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. 'అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తాం, ఉద్యోగాలు ఇవ్వలేకపోతే ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తాం..' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన ఆయన.. సీఎం అయ్యాక మొహం చాటేశారు. కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి ఒక్క ఉద్యోగం ఇచ్చివుంటే ఒట్టు. ఏ నిరుద్యోగికీ గడిచిన 9 నెలల్లో పది రూపాయలు నిరుద్యోగ భృతి కింద అందలేదు. దీంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

ఎంఎస్‌ఎంఈల జాడేదీ..?
కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటు ఊసే లేదు. గత ప్రభుత్వ హయాంలో రమారమి 22 వేల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 55 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి లభించింది. కానీ ఇప్పుడు చిన్న పరిశ్రమల జాడే కానరావడం లేదు. పరిశ్రమలు పెడతామంటూ ఎవరైనా ముందుకొచ్చినా టీడీపీ నేతలు మామూళ్ల కోసం బెదిరిస్తుండటంతో వెనక్కు జంకుతున్న దుస్థితి నెలకొంది.

వలసలే శరణ్యం..
అసలే ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు ప్రాంతం. అయితే, గత ప్రభుత్వ హయాంలో పుష్కలంగా వర్షాలు కురవడం, అన్ని వర్గాలకు ఆర్థిక చేయూతనివ్వడంతో ప్రజలకు బాధలు తప్పాయి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పటికే గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల నుంచి కర్ణాటక ప్రాంతానికి భారీగా వలసలు వెళుతున్నారు.

సాఫ్ట్‌వేర్ కలలు కల్లలు..
ఈ ఏడాది అంతర్జాతీయ విపణి బాగా లేదన్న కారణంగా సాఫ్ట్‌వేర్ సంస్థలూ నియామకాలు చేపట్టలేదు.దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటకు వచ్చిన 90 శాతం మందికి పైగా ఇంటివద్దే ఉన్నారు. ఉద్యోగం లేక యాతన పడుతున్నారు.చేసేది లేక కొంతమంది పెట్రోలు బంకుల్లో చాలీచాలని జీతాలకు ఉద్యోగాల్లో చేరుతున్న పరిస్థితి కనిపిస్తోంది.



ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిరుద్యోగులు

పీజీ, ఎంటెక్ చేసిన వారు	1,06,000
డిగ్రీ, బీటెక్ చేసిన వారు	2,40,000
టీటీసీ చేసిన వారు	35,800
ఐటీఐ, డిప్లొమా చేసిన వారు	78,000
ఇతరత్రా విద్యార్హతలు ఉన్నవారు	2,70,000
మొత్తం నిరుద్యోగులు	7,29,800

నిరుద్యోగ భృతి ఊసేలేదు



నేను ఎంఏ, బీఈడీ చదివాను. ఉద్యోగం దొరక్క ఇంటి వద్దనే ఉన్నాను. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లేకపోతే ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా... హామీ అమలు చేయలేదు. నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించలేదు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి అందించాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

– జీఎస్ నగేష్ , మడకశిర

హామీ ఇచ్చి మోసం చేశారు



నేను బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశా. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే ఉద్యోగం వచ్చే వరకూ భృతి ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కానీ అమలు చేయకుండా మోసం చేశారు. ఇప్పటికైనా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. లేకపోతే భృతి మంజూరు చేయాలి.

– పునీత్‌కుమార్, తుంగోడు గ్రామం, సోమందేపల్లి మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం కల్పనకు శ్రీకారం చుట్టాలి. అంతవరకూ నిరుద్యోగ భృతి అందించి ఆదుకోవాలి. నిరుపేద కుటుంబాల్లోని యువత 9 నెలలుగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ గడుపుతోంది. వీలైనంత త్వరగా నిరుద్యోగులకు చేయూత అందించాలి.

– ప్రవీణ్, పట్టభద్రుడు, ధర్మవరం

యువత పోరుతో బాబుకు బుద్ధి చెబుదాం



పార్టీ శ్రేణులతో కలిసి 'యువత పోరు' పోస్టర్లను విడుదల చేస్తున్న ఉషశ్రీచరణ్

- రూ.4500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి వెంటనే విడుదల చేయాలి
- 12న 'యువత పోరు'కు అన్ని వర్గాలు కలిసివచ్చి విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు

పరిగి: 'చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు... చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవు. కనీసం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అయినా ఇస్తారంటే..అందుకూ చంద్రబాబుకు మనసు రావడం లేదు.. అలవిగాని హామీలతో నమ్మించి యువతను మోసం చేసిన సీఎం చంద్రబాబుకు 'యువత పోరు'తో బుద్ధి చెబుదాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె పరిగిలో ఈనెల 12న వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఎన్నికల హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కేవలం పింఛన్లు చూపుతూ ఆర్భాటం చేయడం తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

నయవంచన ప్రభుత్వ మెడలు వంచుదాం
ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం కింద రూ.4,500 కోట్లు బకాయిలున్నాయని, వాటిని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు... మాట తప్పారన్నారు. అందరూ సంఘటితమై ఈ ప్రభుత్వ మెడలు వంచుదామని ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 12వ తేదీ 'యువత పోరు'లో భాగంగా పుట్టపర్తిలో పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై మొత్తంగా 218 అర్జీలు అందించారు. కలెక్టర్ చేతన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి అర్థవంతమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి' అన్న నినాదంతో ఈనెల 15వ తేదీన స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీ–4 సర్వేను మండలాల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, సీపీఓ విజయ్ కుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ఉగాది నుంచి జిల్లాలో పీ–4 సర్వే
'స్వర్ణాంధ్ర–2047'లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం జిల్లాలో ఉగాది నుంచి పీ–4 సర్వేకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పీ–4 కార్యాచరణకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పేదరికం లేని సమాజం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ–4) సర్వే చేస్తోందన్నారు. కార్యక్రమం అమలుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. ఈనెల 25వ తేదీలోపు అభిప్రాయాలు తెలియజేసే వారికి ప్రశంసా పత్రం అందిస్తామన్నారు.

వర్మీకంపోస్టుపై అవగాహన కల్పించాలి
చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో గోరంట్ల గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన ఆర్గానిక్ వర్మీ కంపోస్ట్ స్టాల్‌ను ఆయన సందర్శించారు.

భూ ఆక్రమణలను అరికట్టండి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న సంజీవపురం మాజీ సర్పంచ్ ముల్లగూరు సంజీవ రాయుడు

బత్తలపల్లి మండలం సంజీవపురం సర్వే నంబర్ 97లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ముల్లుగూరు సంజీవ రాయుడు ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ విజయసారథికి విన్నవించారు. సర్వే నంబర్ 97లో గ్రామసచివాలయం, ఆర్‌ఎస్‌కే, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మించారని, మిగిలిన స్థలంలో 'చింత–నిశ్చింత' కార్యక్రమం క్రింద చింత చెట్లు నాటారన్నారు. గ్రామానికి చెందిన కొందరు నాయకులు చింత చెట్లను నరికేసి అక్రమంగా ఇంటి పునాదులు తవ్వుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి నారా లోకేష్.. చిత్రంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట

- వైభవంగా లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు
- ఆలయంలో మార్మోగిన గోవింద నామస్మరణ
- భక్తులతో పోటెత్తిన నృసింహాలయం

కల్యాణ వైభోగమే

వేదపండితుల మంత్రోచ్చారణలు.. భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. సర్వాలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడి దివ్యమంగళ రూపం చూసి భక్తజనం తరించారు.

కదిరి: ప్రహ్లాద వరదుడు, వసంత వల్లభుడు, కాటమరాయుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీ లక్ష్మీ నారసింహుని కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

పల్లకీపై వచ్చిన శ్రీవారు..
నవ వధువులుగా అలంకృతులైన శ్రీదేవి, భూదేవితో పాటు వరుడు లక్ష్మీ నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో యాగశాల నుంచి పల్లకీపై కల్యాణ మండపం చేరుకున్నారు. అప్పటికే అక్కడ కిక్కిరిసిన భక్తజనం నోట శ్రీవారి గోవింద నామస్మరణ మార్మోగి పోయింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విచ్చేసిన అర్చక పండితులు శ్రీవారి కల్యాణోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ముక్కోటి దేవతలు వీక్షించే స్వామివారి వివాహాన్ని సాక్షాత్తు బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తున్నారని అర్చక పండితులు తెలియజేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీవారికి ప్రతిరూపంగా విచ్చేసే కంకణ భట్టాచార్యులు మంగళ సూత్రాలను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం భక్తులందరికీ శ్రీవారి తలంబ్రాలు పంచిపెట్టారు. కల్యాణోత్సవ ఉభయదారులుగా నామా రామచంద్రయ్యశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.



శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు..
రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చారు. అంతకుముందు ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. లోకేష్ రాకతో ఆలయ ప్రాంగణం టీడీపీ శ్రేణులతో నిండిపోయింది. దీంతో సామాన్య భక్తులు శ్రీవారి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించలేకపోయారు.



మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

ధ్వజారోహణంతో దేవతలకు ఆహ్వానం
నృసింహుని బ్రహ్మోత్సవాలను నలుదిక్కులా చాటేందుకు సోమవారం ఉదయం ప్రధాన ఆలయం ముందున్న ధ్వజ స్తంభానికి అర్చక పండితులు గరుడ దండాన్ని ధ్వజారోహణం చేశారు. సకల దేవతలకు ఇదే శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక..అని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు పేర్కొన్నారు. పాల్గుణ కృష్ణ అష్టమి నాడు అంటే ఈ నెల 22న జరగనున్న తీర్థవాది ఉత్సవం రోజున శ్రీవారి చక్రస్నానం అనంతరం ఈ గరుడ దండాన్ని అవరోహణం చేస్తారు. దీంతో ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

నేడు హంస వాహనంపై ఖాద్రీశుడు
ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కాటమరాయుడు హంసవాహనంపై దర్శనమివ్వనున్నారు. భక్త జనుల గోవింద నామ స్మరణల మధ్య తిరువీధుల గుండా విహరించనున్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 55 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన)కు వివిధ సమస్యలపై 55 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించారు. సమస్య తీవ్రత అడిగి తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లె అక్రమాలపై ఈడీ విచారణ చేయించాలి

- కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసిన ఎంపీపీ ఆదినారాయణయాదవ్

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్: టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అక్రమ వ్యాపారాలు, మనీ లాండరింగ్, విద్యాసంస్థల పేరుతో ఫీజుల దోపిడీ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించారని, వీటన్నింటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తో విచారణ చేయించాలని ముదిగుబ్బ ఎంపీపీ, బీజేపీ నాయకుడు ఆదినారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక పల్లె రఘునాథరెడ్డితో పాటు బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, ఇంకొందరు కలసి తనను అంతమొందించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వారం క్రితం సంకేపల్లి వద్ద వాహనంపై రాళ్లతో దాడి చేశారని, ఇప్పుడు పుట్టపర్తికి వస్తుండగా దారి పొడవునా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. కియా వద్ద ఉన్న తన భూమిని కాజేసే ప్రయత్నంలో భాగంగా పల్లె రఘునాథరెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దొంగ పత్రాలు, నకిలీ అగ్రిమెంట్లతో బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఈ భూ వివాదాలతో మంత్రి సత్యకుమార్‌కు సంబంధం లేకున్నా.. తరచూ వీటిలోకి లాగుతున్నారన్నారు.

• తుప్పు పడుతున్నాయ్



ఎంపీడీఓ కార్యాలయంలో మూలన వేసిన వీల్ చైర్లు

ధర్మవరం రూరల్: గత ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లోకి దివ్యాంగులను తీసుకెళ్లేందుకు వీలుగా పంచాయతీకి ఒకటి చొప్పున 18 పంచాయతీలకు వీటిని అప్పట్లో అందించారు. అయితే వీటిని పంచాయతీలకు తరలించకుండా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే ఉంచేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత వాటి బాగోగులను పట్టించుకోలేదు. దీంతో దుమ్ము, దూళి చేరి అవి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.

టమాట రైతు చిత్తు

- నాలుగు నెలలుగా గిట్టుబాటు ధర లేక భారీగా నష్టాలు
- కిలో రూ.8 చొప్పన కొంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం
- కేవలం 60 టన్నులతో చేతులెత్తేసిన మార్కెటింగ్ శాఖ
- రాష్ట్రంలోనే అత్యధికంగా 45 వేల ఎకరాల్లో టమాట పంట



కక్కలపల్లి టమాట మండీలో కొనసాగుతున్న క్రయవిక్రయాలు



నాణ్యమైన టమాటకు 'నో సేల్' అంటూ పేపర్‌పై ఇంటూ మార్క్ వేసిన దృశ్యం (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: టమాటను నమ్ముకున్న రైతులు ఈ సారి కూడా భారీగా నష్టాలు మూటకట్టుకున్నారు. అనంతపురం జిల్లాలో ఏకంగా ఖరీఫ్, రబీలో ఈ ఏడాది 45 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో టమాట సాగులోకి వచ్చింది. ఈ సారి 8 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడిని రైతులు సాధించారు. టన్ను సరాసరి కనిష్టంగా రూ.15 వేలు ప్రకారం అమ్ముడుబోయినా ఈ సారి రూ.1,200 కోట్ల మేర టర్నోవర్ ఉండేదని అంచనా. కానీ మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా 80 శాతం మంది రైతులు భారీగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో అనంతపురం జిల్లాలో 45 వేల ఎకరాల టమాట సాగులో మొదటి స్థానంలో ఉండగా... 22 వేల ఎకరాలతో శ్రీసత్యసాయి జిల్లా రెండో స్థానంలో ఉండటం విశేషం. ఆ తర్వాత అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు ఉన్నాయి.

నాలుగు నెలలుగా పతనావస్థలో..

సీజన్ ఆరంభమైన జూలై నుంచి అనంతపురం సమీపంలో ఉన్న కక్కలపల్లి మండీలో టమాట అమ్మకాలు మొదలయ్యాయి. మొదట్లో పరిస్థితి ఆశాజనకంగా ఉండటంతో రైతులు టమాట సాగుపై ఎక్కువగా దృష్టి పెట్టారు. ఫలితంగా సెప్టెంబర్ నుంచి పంట దిగుబడులు, మార్కెట్‌కు సరుకు రావడం పెరిగింది. ధర కొంచెం బాగున్నప్పుడు మధ్య మధ్యలో వర్షాలు రావడంతో పంట తడిసిందని, మచ్చ ఉందంటూ మండీ నిర్వాహకులు, వ్యాపారులు 'నో సేల్' పెట్టడంతో చాలా మంది రైతులకు అసలుకే మోసపోయారు. ఇలా డిసెంబర్ వరకు టమాట అమ్ముడుపోక కొందరు రైతులు తల్లడిల్లిపోయారు. ఇక డిసెంబర్ నుంచి మార్కెట్ పూర్తిగా పతనమైంది. గరిష్ట ధర రూ.10, కనిష్టం రూ.5, సరాసరి రూ.7 చొప్పున గత మూడు నెలలుగా మార్కెట్‌లో ధరలు కొనసాగుతుండటంతో టమాట రైతులు పూర్తిగా చిత్తయ్యారు. నాలుగైదు లాట్ల గరిష్ట ధర రూ.10 ప్రకారం అమ్ముడుబోగా మిగతాదంతా రూ.5 నుంచి రూ.7 కి మించి ధర పలకలేదు. దీంతో చాలా మంది రైతులు.. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాదని గ్రహించి పంటను పొలాల్లోనే వదిలేశారు.

'కూటమి' మోసం..

జిల్లాలోని 31 మండలాల్లో ఖరీఫ్‌లో 42 వేల ఎకరాలు, రబీలో 3 వేల ఎకరాల్లో టమాట సాగు చేసినట్లు ఉద్యానశాఖ నివేదికలు చెబుతున్నాయి. టమాట రైతులు ఇబ్బంది పడకుండా కిలో రూ.8 చొప్పున టన్ను రూ.8 వేలతో కొనుగోలు చేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణకు వచ్చేసరికి మార్కెటింగ్‌శాఖ ద్వారా ఇటీవల కేవలం 60 టన్నులు అంటే రూ.4.80 లక్షల విలువ చేసే టమాట మాత్రమే కొనుగోలు చేసి చేతులెత్తేసింది. అనంతపురం మండీకి ప్రస్తుతం కొంత తగ్గినా డిసెంబర్ నుంచి పరిగణనలోకి తీసుకుంటే రోజుకు సగటున 500 టన్నుల వరకు సరుకు వస్తోంది. కనీసం రోజుకు 100 టన్నులైనా కొనుగోలు చేస్తే కొంత వరకు రైతులకు వెసులుబాటు ఉంటుంది. కానీ సీజన్ అంతా కొన్నది కేవలం 60 టన్నులు మాత్రమే అంటే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

పెట్టుబడి కూడా అందలేదు



ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాల్లో టమాట సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక భారీగా నష్టపోయాను. ఇటీవల మండీలో 15 కిలోల బాక్సు రూ.70కు మించి పలకలేదు. అంటే కిలో రూ.5 చొప్పున కూడా కొనుగోలు చేయడం లేదు. మొదటి నాలుగైదు కోతల్లో నాణ్యమైన కాయ ఉన్నా కొనలేదు. పెట్టుబడి మాట దేవుడెరుగు కనీసం కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతికి అందలేదు. ఇలా అయితే రైతులు ఎలా బతకాలి.

– సుధాకర్, టమాట రైతు, దయ్యాలకుంటపల్లి, బీకేఎస్ మండలం

పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య



నరసింహులు (ఫైల్)

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నరసింహులు (34) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం నొప్పి తీవ్రత తాళలేక కొండాపురం సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

హిందూపురం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. హిందూపురంలోని ఆటోనగర్‌కు చెందిన లక్ష్మీకాంత్ (21)కు భార్య జ్యోతి, ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భిణి. తల్లిదండ్రులు బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న లక్ష్మీకాంత్ కొంత కాలంగా వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తన అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు సమకూరక ఇబ్బంది పడిన లక్ష్మీకాంత్ సోమవారం వేకువజామున ఆటోనగర్ వద్ద పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం

ఉరవకొండ: స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఉరవకొండలోని ఇంద్రా నగర్‌కు చెందిన కార్తీక్ (18), నందకుమార్ సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతూ వేగాన్ని నియంత్రించుకోలేక డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నందకుమార్‌ను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై సీఐ మహానంది కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు మోసం చేశారు

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుకొండ రూరల్: డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ నేతృత్వం వహించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అధికారం చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు నెరవేర్చకుండా మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడచిన అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలకు పరిష్కారం దొరకలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలన్నారు. అలాగే వేతనంతో కూడిన మెడికల్ లీవులను కనీసం 3 నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఫ్రీ స్కూల్ విద్యార్థులకు కూడా తల్లికి వందనం ఇవ్వాలని కోరుతూ కార్యాలయ ఏఓ గిరిధర్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, రంజిత్ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, జయతుంబి, లక్ష్మీదేవి, పార్వతి, శాంతి బాయి, సరస్వతి తదితురులు పాల్గొన్నారు.

పక్కా గృహాల కూల్చివేత

- మడకశిరలో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా తొలగింపు



మైనార్టీ కాలనీలోని ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

మడకశిర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన మైనార్టీ కాలనీలోని పలు పక్కా గృహాలు, ఇంటి పునాదులను అధికారులు తొలగించారు. గుట్టుచప్పుడు కాకుండా, లబ్ధిదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఈ ప్రక్రియను సెలవు రోజైన ఆదివారం చేపట్టడం విమర్శలకు దారి తీసింది. సోమవారం కూడా తొలగింపు ప్రక్రియను అధికారులు కొనసాగించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మడకశిరలోని మైనార్టీలకు ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేశారు. ఇందు కోసం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద అప్పట్లో భూసేకరణ చేసి మైనార్టీ కాలనీని ఏర్పాటు చేశారు. దాదాపు 180 మందికి కాలనీలో పక్కా గృహాలు మంజూరు కాగా, ఆర్థికంగా స్థోమత ఉన్న వారు ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మరికొందరు పునాదులు వేసుకున్నారు. కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మడకశిర మీదుగా రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ నిర్మాణాన్ని చేపట్టాయి. ప్రస్తుతం ఈ పనులు మడకశిర సమీపంలో జరుగుతున్నాయి. ఈ కాలనీ గుండానే రైల్వేలైన్ పోతోంది. దీంతో కాలనీలోని దాదాపు 73 పక్కా గృహాలు రైల్వే లైన్ పనులకు అడ్డంకిగా మారాయి. వీటిని తొలగించాలని సంబంధిత అధికారులు కొన్నేళ్లుగా లబ్ధిదారులకు సూచిస్తూ వచ్చారు. అయితే తమకు ప్రత్యామ్నాయం చూపించి ఇళ్లు, ఇంటి పునాదులు తొలగించుకోవాలని స్థానికులు కోరుతూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం అధికారులు భారీ యంత్రాలతో అక్కడకు చేరుకుని కూల్చివేతలు చేపట్టారు. ఈ మొత్తం ప్రక్రియను జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో జేసీ అభిషేక్‌కుమార్ కల్పించుకుని బాధితులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ కేసులంటూ వేధిస్తున్నారు

- రక్షణ కల్పించాలని జేసీకి ఉద్యోగుల వేడుకోలు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు

ప్రశాంతి నిలయం: విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసుల పేరుతో బెదిరిస్తున్నారని, తమను రక్షణ కల్పించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు వారు సోమవారం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. గత శుక్రవారం సాయంత్రం పెడపల్లి సచివాలయానికి రంగప్ప, తిప్పన్న అనే వ్యక్తులు వచ్చి రూ.1.5 లక్షలకు ఇంటి పన్ను మదింపు సర్టిఫికెట్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని అడిగారన్నారు. వారిచ్చిన ఆధారాల మేరకు అంత మొత్తానికి సర్టిఫికెట్ ఇచ్చే అవకాశం లేదని తెలియజేస్తే సదరు వ్యక్తులు ఆగ్రహంతో ఊగిపోతూ దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి ప్రయత్నించారన్నారు. మీరెలా విధులు నిర్వహిస్తారో చూస్తామంటూ బెదిరించారని, అంతటితో ఆగకుండా నలుగురు సచివాలయ ఉద్యోగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, సురేంద్ర, గణేష్, ఓం ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్ అత్యాశ



కదిరి ఏరియా ఆస్పత్రి



ప్రైవేటు స్కానింగ్ సెంటరుకు రెఫర్ చేసిన చీటీ

- స్కానింగ్‌లన్నీ ప్రైవేట్ ల్యాబ్‌కు
- ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యమున్నా కమీషన్ కోసం కక్కుర్తి
- గర్భిణులకు రూ.వేలల్లో ఖర్చు

కదిరి అర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యురాలి ధన దాహానికి పేదలు బలవుతున్నారు. రూ.లక్షల్లో జీతం తీసుకుంటూనే కమీషన్ కోసం కక్కుర్తి పడి స్కానింగ్‌లన్నీ ప్రైవేట్ ల్యాబ్‌కు సిఫారసు చేస్తున్నారు. ఫలితంగా ప్రతి స్కానింగ్‌కు రూ.వేలల్లో గర్భిణులు నష్టపోతున్నారు.

స్కానింగ్ యంత్రాలున్నా..

రోజూ 2 వేల ఓపీ ఉన్న కదిరి ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పనితీరు సక్రమంగానే ఉంది. అయినా ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా వైద్యురాలు మాత్రం వీటి సేవలను ఏ మాత్రం వినియోగించుకోవడం లేదు. ప్రతి సారీ స్కానింగ్‌కు ప్రైవేట్ ల్యాబ్‌కు సిఫారసు చేయడం ద్వారా రూ.వేలల్లో ఆమెకు కమీషన్ దక్కుతున్నట్లు సమాచారం. కమీషన్ల కక్కుర్తిలో పడిన ఆమె దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోతోందని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

ఈ విషయం తెలుసు



ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రూ.45 లక్షలు విలువ చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అయినా డాక్టర్ బయటకు రాసిస్తున్నారు. ఈ విషయం తెలుసు. ఇప్పటికే చాలా ఫిర్యాదులు కూడా అందాయి. తీరు మార్చుకోవాలని ఆమెకు చెప్పినా పట్టించుకోవడం లేదు. బాధితులు ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హుస్సేన్, సూపరింటెండెంట్, కదిరి ఏరియా ఆస్పత్రి

అక్కడ కూడా 'ఆమె'నే

ఈ నెల 7న కదిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి పురిటి నొప్పులతో కాన్పు కోసం కదిరి ఏరియా ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యురాలు.. గర్భంలో సమస్య ఉందని నాలుగు స్కానింగ్‌లను ఆస్పత్రి పక్కనే ఉన్న ప్రైవేట్ ల్యాబ్‌లో చేయించుకుని రావాలని రాసిచ్చింది. ఆస్పత్రిలో స్కానింగ్ చేయరా? అని ఆమె బంధువులు అడిగితే ఇక్కడ అలాంటి సౌకర్యం లేదని బుకాయించినట్లు సమాచారం. దీంతో గర్భిణిని పిలుచుకుని డాక్టర్ చెప్పిన స్కానింగ్ సెంటర్‌కు బంధువులు వెళ్లారు. కాసేపటి తర్వాత స్కానింగ్ గదిలోకి గర్భిణిని తీసుకెళితే అక్కడ సదరు డాక్టరే ప్రత్యక్షమై స్కానింగ్ చేసి, రిపోర్టులు తీశారు. ఈ మొత్తం ప్రక్రియకు రూ.4,500 ఫీజును చెల్లించుకోవాల్సి వచ్చిందని, స్కానింగ్‌లో ఎలాంటి అనుమానాస్పద రిపోర్టులూ రాలేదని బాధితులు వివరించారు. ఇదే తరహాలో రోజూ పదుల సంఖ్యలో గర్భిణులను ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు పంపుతూ నిర్వాహకుల నుంచి కమీషన్లను ప్రభుత్వ గైనకాలజిస్ట్ దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

హోరాహోరీగా ఇరుసు ఎత్తు పోటీలు



ఇరుసు ఎత్తుతున్న గుంతకల్లు మండలం తిమ్మాపురం వీరేష్

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికిలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి గ్రామీణ యువకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పోటీ పడ్డారు. గుంతకల్లు మండలం తిమ్మాపురం వీరేష్ ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో పామిడి మండలం వంకరాజుకాలువకు చెందిన నరేష్, తృతీయ స్థానంలో నాగలాపురం గ్రామానికి చెందిన నరేంద్ర నిలిచారు. విజేతలను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.

నేడు ఎస్కేయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పాలిమర్ సైన్సెస్ సెమినార్ హాలులో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె. అనిత తెలిపారు. చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. అభ్యర్థులకు రాత పరీక్ష, డెమో లెక్చర్స్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న ఆర్ట్స్, సైన్స్ అభ్యర్థులు తమ రెజ్యూమ్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న చంద్రమౌళీశ్వరస్వామి



లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవంగా లంకాదహనం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన లంకాదహనం వైభవంగా జరిగింది. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై చంద్రమౌళీశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా కురుబ సేవా సంఘం ఆధ్వర్యంలో గొరవయ్యల పాలు తాపించే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది.